శాంతియుతంగా జరుపుకోవాలి

- హనుమాన్ శోభాయాత్రకు పూర్తి సహకారం అందించాలి
- కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 పర్యవేక్షణ
- ఎస్పీ బి.బాలస్వామి

మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

మెదక్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. సంబంధిత, రెవెన్యూ, మున్సిపల్, ట్రాన్స్‌కో లాంటి అన్ని శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ విధులు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. హనుమాన్ శోభాయాత్రలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అవసరం ఉన్న ప్రదేశాల్లో ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని, ట్రాఫిక్ జాం కాకుండా ప్రతి చౌరస్తా పికెట్స్, ట్రాఫిక్ పాయింట్స్ ఏర్పాటు చేశామని ర్యాలీ నిర్వహించే సమయంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. హనుమాన్ శోభయాత్రను జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రో ల్ ద్వారా 24/7 పర్యవేక్షిస్తూ సంబంధిత పోలీసు అధికారులకు తగిన సూచనలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శోభయాత్ర సమయంలో సామాజిక మాధ్యమాలలో ఇతరుల మనోభావాలను కించపరచడం చేయరాదు. ఎలాంటి అభ్యంతరకరమైన పోస్టులు పెట్టకూడదని సోషల్ మీడియాపై ఐటీ కోర్ టీమ్ తో నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని అలాంటి తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచా రం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

410 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- 2,711 రైతుల నుంచి 11,632 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 143 మంది రైతులకు రూ. 1.51 కోట్లు ఖాతాల్లో జమ
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సేకరించామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఇప్పటివరకు 2,711 రైతుల నుంచి 11,632 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. 143 మంది రైతులకు ఒక కోటి 51 లక్షల రూపాయలు జమచేశామని వివరించారు. ప్రస్తుతం అన్నిచోట్ల అకాల వర్షాలు పడుతున్నాయని, అన్ని కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు 410 సెంటర్లలో 3,200 అందుబాటులో ఉంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి రక్షణ కల్పిస్తున్నామన్నారు. అకాల వర్షాల దృష్ట్యా ఇంకా అవసరమగు చోట్ల సరిపడు టార్పాలిన్ కవర్లు సమకూర్చాలని మార్కెటింగ్ శాఖను ఆదేశించామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను పర్యవేక్షించాలని కోరారు. రైతులు అధైర్య పడొద్దని, కొనుగోలు కేంద్రాల్లో ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు దళారుల వద్ద మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైన సమస్యలుంటే రైతులు కంట్రోల్ రూమ్ నెంబర్ 9281103685 కు సంప్రదించవలసిందిగా తెలిపారు.

వైకుంఠరథం బహూకరణ

గ్రామానికి వైకుంఠరథాన్ని అందిస్తున్న రమేశ్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని జంగరాయి గ్రామానికి చెందిన చేపూరి లతా రమేశ్ రూ. 2.30 లక్షల విలువ చేసే వైకుంఠరథాన్ని ఆదివారం బహూకరించారు. మాజీ సర్పంచ్ బందెళ్ల జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్, శ్రీను గ్రామస్తులు ఉన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

తొగుట : వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, ఏప్రిల్ 21: మండలంలోని వెంకట్రావుపేట చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఎంగాలి రాకేశ్ పెండ్లి సిద్దిపేట బీసీ ముదిరాజ్ ఫంక్షన్ హాల్లో జరిగింది.ఈ వివాహానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు ఎండీ కలీమోద్దీన్,మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సిరినేని గోవర్ధన్‌రెడ్డి,ఎంపీటీసీ వేల్పుల స్వామి,మాజీ సర్పంచ్‌లు పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి,మంగ నరసింహులు, మాజీ ఎంపీటీసీ అల్వాల కృష్ణాగౌడ్ ఉన్నారు సుతారి నర్సింహులు కూతురు వివాహ వేడులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశ్వీరదించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, మాజీ ఏఎంసీ చైర్మెన్ వల్లాల సత్యనారాయణ బీఆర్ఎస్ నాయకుడు సూకురి లింగం ఉన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి ఏప్రిల్ 21: మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌కు చెందిన ఎంపీటీసీ

ప్రజలు సంతోషంగా ఉండాలి

రాయపోల్ ఏప్రిల్ 21: పెద్దమ్మ ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపల్లి పెద్ద ఆరేపల్లి గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ అలయ మొదటి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల దేవాలయల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

ముదిరాజ్ రాష్ట్ర నాయకుడు నాగేశ్ ముదిరాజ్

మాట్లాడుతున్న నగేశ్ ముదిరాజ్

పాపన్నపేట, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నగేశ్ ముదిరాజ్ సూచించారు. ఆదివారం పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్‌పేటలోని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి స్వగృహంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా సుపరిచితుడని ముదిరాజ్‌లు ఐకమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సొంగ దుర్గయ్య, సత్యనారాయణ,మాజీ సర్పంచ్‌లు కిష్టయ్య, ఆశయ్య, సుధాకర్, మాజీ ఎంపీటీసీ సాయిలు, సిద్ధిరాములు, మనోహర్, వివిధ గ్రామాల ముదిరాజ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి

ప్రార్థనల్లో పాల్గొన్న వందలాది మంది భక్తులు

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

దైవసందేశం చేస్తున్న ఫాస్టర్ శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 21: భక్తులతో మెదక్ చర్చి కిటకిటలాడింది. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు రావడంతో చర్చి లోపలి ప్రాంగణం నిండిపోయింది. ఈ సందర్భంగా ఏసయ్య నామస్మరణలతో హోరెత్తింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని ఏసయ్యకు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులనుద్దేశించి చర్చి ఫాస్టర్లు దైవసందేశం చేశారు. ప్రార్థనల అనంతరం ఫాస్టర్లు భక్తులను ఆశ్వీరదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్ డగ్లస్, సంశాన్ సందీప్, నోబుల్‌సన్, జాన్స న్, జాయ్‌ముర్రే తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నర్సాపూర్, ఏప్రిల్ 21: నివాస పూరి గుడిసె దగ్ధమై ఆస్తి నష్టం జరిగిన బాధిత కుటుంబ సభ్యుడికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు రూ. 15 వేల ఆర్థిక సాయాన్ని, గ్రామానికి చెందిన కాంగ్రెస్‌నేత లక్ష్మీ నారాయణతో బాధిత కుటుంబానికి అందజేశారు. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు గుడిసె శనివారం షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది.

బైక్ టైర్లు చోరీ

నర్సాపూర్‌లో బైక్ టైర్లను దొంగలించిన దుండగులు

నర్సాపూర్, ఏప్రిల్ 21 : బైక్ టైర్లను దొంగలించిన సంఘటన నర్సాపూర్ మున్సిపాలిటీలోని శివాలయం వీధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్ మున్సిపాలిటీ శివాలయం వీధికి చెందిన సారా శ్రీపాల్ రోజుమాదిరిగానే బైక్‌ను శనివారం రాత్రి తన ఇంటి వద్ద పార్క్ చేశాడు. అదే రాత్రి గుర్తుతెలియని దుండగులు బైక్ ఉన్న రెండు టైర్లను విప్పుకొని అక్కడి నుంచి పారిపోయారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ సరిగ్గా ఉంటే ఇలాంటి దొంగతనాలు జరగవని కాలనీ వాసులు వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

పుస్తె మట్టెలు అందజేత

రామాయంపేట, ఏప్రిల్ 21 : గిరిజన కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవడమే తమ లక్ష్యమని గిరిజన కుటుంబాలకు చెందిన ప్రైవేటు డాక్టర్ మోహన్‌నాయక్ అన్నారు. ఆదివారం రామాయంపేట పురపాలిక పరిధిలోని కోమటిపల్లి గిరిజన తండాలో ఓ పెండ్లికి హాజరై నిరుపేదకుటుంబం లంబాడీ లాలు-సుగుణల కూతురు శైలజకు పెండ్లి పందిట్లోనే పుస్తె మట్టెలు అందజేశారు. గిరిజనులు మాజీ వార్డు సభ్యుడు సామ్యా తదితరులు ఉన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు ఘన స్వాగతం

సివిల్స్ ర్యాంకర్ బుద్ధి అఖిల్‌యాదవ్‌ను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

కొండపాక (కుకునూరుపల్లి), ఏప్రిల్ 21 : ఆలిండియా సివిల్స్ ఫలితాలతో 321 వ ర్యాంకు సాధించి ఐపీఎస్ నుంచి ఐఏఎస్‌గా మారి తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని తన సొంత గ్రామానికి చేరుకున్న బుద్ధి అఖిల్‌యాదవ్‌కు స్నేహితులు, గ్రామస్తులు, ఘనస్వాగతం పలికారు. అఖిల్ యాదవ్‌కు గజామాల వేసి వాహనంలో ఊరేగించారు.

ముమ్మరంగా మంబోజిపల్లిలో తనిఖీలు

మంబోజిపల్లిలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

మెదక్‌రూరల్ , ఏప్రిల్ 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు మమ్మురం చేశారు. ఆదివారం మెదక్‌మండల పరిధిలోని మంబోజిపల్లి చౌరస్తా వద్ద చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేయాగా, ఎస్ఎస్‌టీ నరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మల్లేశం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంత్రాలకు వెళ్లప్పుడు రూ. 50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని ఒకవేళ అవసరాల రీత్యా తీసుకెళ్లితే సంబంధిత అధికారులకు చూపించాలన్నారు. పోలీసు కానిస్టేబుల్ నవీణ్ కాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

పోతంశెట్టిపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో అన్నదానం చేస్తున్న దాత సునీతా వెంకట్ గౌడ్

చిలిపిచెడ్(కొల్చారం), ఏప్రిల్ 21: కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు మూడు రోజుల పాటు మాజీ సర్పంచ్ సునీతా వెంకట్ గౌడ్ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా రథోత్సవం

ఇందుప్రియాల్‌లో సీతారాముల రథాన్ని లాగుతున్న భక్తులు

రాయపోల్, ఏప్రిల్ 21 : దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో జరుగుతున్న సీతారాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా అదివారం ఉదయం సీతారాములవారిని విమానరథంపై ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు రథాన్నిలాగారు.ఆలయ ధర్మకర్త అన్నరెడ్డి సుభాష్‌రెడ్డి దంపతులు వేదబ్రాహ్మణ పండితుల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.బ్రహ్మోత్సవాలు సోమవారం ముగుస్తాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

23న హనుమాన్ జయంతి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 21: హుస్నాబాద్ పట్టణంలోని పాటిమీద హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ పేర్కొంది. శ్రీపార్థసారథి గీతా భక్త సమాజం చేత గీతాపారాయణం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవీ పారాయణం, అభిషేకం, హోమంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వ్యక్తి దారుణ హత్య

మనోహరాబాద్, ఏప్రిల్ 21 : స్నేహితులతో బయటకు వెళ్లిన వలస కూలీ దారుణ హత్యకు గురైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం ఘర్కా తాలుకా, బెల్వానియా గ్రామానికి చెందిన సునీల్ మాంజీ, దంజయ్ రెండేండ్ల కింద జీవనోపాధి కోసం వలసవచ్చి మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక వాడలో గల వీవీఎం ఆగ్రో కంపెనీలో వెల్డింగ్ పని చేస్తూ, అక్కడే రూమ్‌లో ఉంటున్నారు. వీరి చిన్న తమ్ముడు సర్వాన్ కుమార్ మాంజీ (23) మూడు నెలల కింద ఇక్కడికి వచ్చి అన్నలతో కలిసి పనిచేస్తూ పరిశ్రమలో గల రూమ్‌లో ఉంటున్నాడు. కాగా శనివారం రాత్రి మృతుడు సర్వాన్‌కుమార్ మాంజీ (23), అదే పరిశ్రమలో పని చేస్తున్న సంజయ్, ఓం ప్రకాశ్ రాయ్‌లతో కలిసి కిరాణా సరుకులు తేవడానికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత సంజయ్ తిరిగి రూమ్‌కి వచ్చేశాడు. సర్వాన్‌కుమార్ మాంజీ (23), ఓం ప్రకాశ్ రాయ్‌లు రాలేదు. దీంతో మృతుడి అన్నలు సునీల్‌మాంజీ, దంజయ్ పరిశ్రమ చుట్టూ పక్కల వెతుకగా పరిశ్రమ గేటు పక్కన సెల్ ఫోన్ పడి ఉండడాన్ని గమనించి అక్కడే వెతికారు. పరిశ్రమ ప్రహరీ పక్కన గల చెట్ల పొదల్లో సర్వాన్ కుమార్ మాంజీ (23) తలకు తీవ్రగాయాలై మృతి చెంది ఉన్నాడు. మృతదేహం పక్కన రక్తపు మరకలతో ఉన్న బండరాయి ఉండటం గమనించారు. ఓం ప్రకాశ్‌రాయ్ తమ్ముడైన సర్వాన్‌కుమార్ మాంజీ (23)తో గొడవపడి బండరాయితో తలపై మోది హత్య చేసి పారిపోయాడని అనుమానం వ్యక్తం చేస్తూ సునీల్‌మాంజీ, దంజయ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు

మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తులు

మెదక్‌రూరల్ , ఏప్రిల్ 21 : మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి శివారులోని కోయ్యగుట్టపై కొలువు దీరిన శ్రీమల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం ఆల య పూజారి మల్లన్న ఆధ్వర్యంలో వేకువజామునే నుంచే ప్రత్యేక పూజలు రేణుకామాతకు ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సుతారిపల్లిలో చెత్తను వాహనంలో తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

రామాయంపేట, ఏప్రిల్ 21 : రామాయంపేట మండలంలోని రాయిలాపూర్, సుతారిపల్లి, ఆర్.వెంకటాపూర్ గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు వీధివీధినా తిరుగుతూ పారిశుధ్య కార్మికులతో పనులను చేయించారు. మూడు గ్రామాల్లో పారిశుధ్య కార్మికులతో గ్రామంలోని ప్రధాన వీధులను, మురికి కాలువలను శుభ్రం చేయిస్తూ చెత్తను సేకరించి చెత్త ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. గ్రామాలను కాలుష్యంలేని గ్రామాలుగా తయారు చేయడమే తమ లక్ష్యమని కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు శ్యామల, పద్మ, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మడేలేశ్వర శీతలాదేవి ఆలయ ఉత్సవాలు

చల్మెడలో హోమం కార్యక్రమంలో పాల్గొన్న రజక సంఘం సభ్యులు

నిజాంపేట, ఏప్రిల్ 21 : మండలంలోని చల్మెడలో నూతనంగా నిర్మించిన మడేలేశ్వర శీతలాదేవి ఆలయంలో ఉత్సవాలు రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల విందుగా ప్రారంభమైనాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో వేద పండితులు రామ్మోహన్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన హోమం కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల కళాశాల ప్రవేశ పరీక్ష

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పది పరీక్షా కేంద్రాలో 2443 మంది విద్యార్థులకు 2179 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 89.3 హాజరు శాతం నమోదు అయిందన్నారు. వీరిలో ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి 1217 మందికి గానూ 1098 మంది విద్యార్థులు, బైపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి 1179 మందికి గానూ 1049 మంది విద్యార్థులు, ఎంఈసీ గ్రూప్‌లో ప్రవేశానికి 45 మందికి 32 మంది హాజరైనట్లు తెలిపారు.

భార్యాభర్తల మధ్య గొడవ.. భార్య ఆత్మహత్య

వంగ స్వాతి (మాధవి)(ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 21 : ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని చేగుంటలోని స్టేషన్ రోడ్డులో ఆదివారం చోటు చేసుకుంది. చేగుంటకు చెందిన పద్మశాలీ వర్గానికి చెందిన వంగ స్వాతి (మాధవి) (35) భర్త సత్యనారాయణ టైలర్. వీరికి 16 ఏండ్ల కుమారుడు సారథి, 13 ఏండ్ల కూతురు స్వాతిక ఉన్నారు. కొన్ని రోజులుగా తరచు భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. మనస్తాపంతో జీవితంపై విరక్తిచెంది ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభు త్వ దవాఖానకు తరలించి దర్యప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

ఆలయానికి విరాళం అందజేత

చల్మెడలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి

నిజాంపేట, ఏప్రిల్ 21: మండలంలోని చల్మెడ కమన్ వద్ద గౌడ సంఘం సభ్యులు నూతనంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రమేశ్, గౌడ సంఘం సభ్యులు యాదగౌడ్, సిద్దగౌడ్, రమేశ్‌గౌడ్, స్వామిగౌడ్, బాలగౌడ్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య

చేగుంట, ఏప్రిల్ 21: అప్పుల బాధతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండల పరిధిలోని వడియారంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండల పరిధిలోని వడియారానికి చెందిన నరేశ్ యాదవ్ (30) డీసీఎం డ్రైవర్. కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు ఎక్కువై తీవ్ర మనస్థాపం చెంది వడియారం సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. మృతిడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

ఆవంచలో పూజలు నిర్వహిస్తున్న రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ

నర్సాపూర్, ఏప్రిల్ 21: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ వెల్లడించారు. మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో ఆదివారం శ్రీ వీరాంజనేయ ప్రతిష్ఠ, బొడ్రాయి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణాకర్, ఎంపీటీసీ శోభ, గ్రామస్తులు విజయ్‌కుమార్, నరసింహారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LAND FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915
NT-5273

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.